క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

కార్వేటినగరం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీపీ లత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతలకు, దివ్యాంగులకు, వితంతువులకు ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్‌ను రూ.3 వేలు పెంచడం జరిగిందన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు పండుగ వాతావరణంలో నిర్వహించే పింఛన్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి పాల్గొంటారని తెలిపారు. సీఎం వైఎస్ జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని అన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వైఎస్సార్‌సీపీ పార్టీలోని వివిధ విభాగాలకు సంబంధించిన వారు అధిక సంఖ్యలో తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు.

బంగారు ఆభరణం బహూకరణ



వేణుగోపాలస్వామివారికి బంగారు ఆభరణాన్ని అందజేస్తున్న భక్తులు

కార్వేటినగరం: నగరంలోని ప్రసిద్ధి చెందిన శ్రీవేణుగోపాలస్వామి వారికి శ్రీరంగరాజపురం మండలం పుల్లూరు క్రాస్‌కు చెందిన భక్తులు జయలక్ష్మి, లోకనాథం దంపతులు సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా స్వామివారికి రూ.30 వేలు విలువజేసే బంగారు ఆభరణాన్ని టీటీడీ ఏఈఓ పార్థసారథి, ఆలయ అధికారి సురేష్‌కుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు దాతలకు వేదమంత్రాలతో పాటు ఆశీర్వచనలు అందించి స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు, అలాగే ఆలయంలో విధులు నిర్వహిస్తున్న చెంగమ్మ సోమవారం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో దాతల కుటుంబసభ్యులు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

నిర్వాణ నారాయణుడి దర్శనం



పలమనేరు: పట్టణ సమీపంలో విష్ణుపురిలోని నిర్వాణ నారాయణుని ఆలయాన్ని రాధా మనోహర్ స్వామీజీ సోమవారం దర్శించుకున్నారు. భారతదేశంలో ఇలాంటి నిర్వాణ నారాయణుని విగ్రహం ఎక్కడా లేదని, నేపాల్‌లోని ముక్తినాథ్‌లో మాత్రమే ఉందని భక్తులు ఆయనకు తెలిపారు. ఆయన భక్తులతో గోవింద నామస్మరణ చేయించారు. హిందూ ధర్మం గురించి ప్రసంగించారు. పట్టణానికి చెందిన పలువురు భక్తులు పాల్గొన్నారు.


టౌన్ బ్యాంక్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బ్యాంక్ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, అధికారులు

తిరుపతి కల్చరల్: తిరుపతి కో ఆపరేటివ్ బ్యాంక్ 2024 సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఆవిష్కరించారు. బ్యాంక్ వైస్ చైర్మన్ వె.వాసుదేవయాదవ్, డైరెక్టర్లు ఎం.నాదమునిరెడ్డి, పి.నాగిరెడ్డి జి.వెంకటేష్ రాయల్, ఆర్.బ్రహ్మానందరెడ్డి, కె.అమర్‌నాథ్‌రెడ్డి, ఖాసీం మహ్మద్, ఎం.చంద్రయ్య, చింతా రమేష్, బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.శివకుమార్‌రెడ్డి, ఆర్.ప్రకాష్, జీఎం వి.వెంకటేష్, సీఎం టి.రవి, వినోద్, మేనేజర్ చంద్రబాబు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సినీనటుడు సుమన్



ఆలయ ధ్వజస్తంభం వద్ద సినీనటుడు సుమన్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం ప్రముఖ సినీనటుడు సుమన్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేంద్రియానాం నయనం ప్రధానం

- రేపటి నుంచి మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం
- రోజా చారిటబుల్ ట్రస్టు, శంకర నేత్రాలయ సంయుక్తంగా ఏర్పాటు
- కంటి పొర ఉన్నవారికి నగరిలోనే ఉచితంగా ఆపరేషన్



మంత్రి రోజా క్యాంపు కార్యాలయానికి చేరిన పరికరాలు

నగరి: కంటి సమస్యలు ఉన్నవారికి ఉచిత చికిత్స అందించడానికి, కంటి పొరలు ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించడానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా మరోమారు భారీ కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రోజా చారిటబుల్ ట్రస్టు, శంకర నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించనున్నారు. మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఈ వైద్య శిబిరం ఈ నెల 10వ తేదీ వరకు కొనసాగనుంది. 8 రోజుల పాటు నియోజకవర్గ ప్రజలకు కంటి సంబంధిత జబ్బులకు ఉచిత వైద్య చికిత్స అందించనున్నారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ వాహనం ద్వారా మైక్రో స్మాల్ ఇన్‌సిషన్ అనే నవీన పద్ధతిలో ఆపరేషన్ చేయనున్నారు. ఆపరేషన్ చేసేవారికి ఆపరేషన్‌తో పాటు ఐఓఎల్ లెన్స్, కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందించనున్నారు. కంటి ఆపరేషన్ చేసుకున్న వారు ఆపరేషన్ జరిగిన రెండు గంటలలో వారి ఇంటికి వెళ్లేందుకు ఆంబులెన్స్ సర్వీసు ఏర్పాటు చేశారు. అత్యంత ఖర్చుతో ఏర్పాటు చేస్తున్న ఈ వైద్యశిబిరాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శిబిర నిర్వాహకులు తెలుపుతున్నారు. నగరి చరిత్రలో ఎవరూ ఇప్పటి వరకు ఇంతటి భారీ నేత్ర వైద్యశిబిరం నిర్వహించకపోగా మంత్రి ఆర్కేరోజా రెండుసార్లు ఈ కంటివైద్య చికిత్స శిబిరం ఏర్పాటు చేయడం ప్రత్యేకత సంతరించుకుంది. గత ఏడాది ఏప్రిల్ నెలలో నిర్వహించిన తొలి శిబిరంలో 2800 మంది హాజరుకాగా 93 రకాల కంటి పరీక్షలు వారికి నిర్వహించారు. వీరిలో 400 మందిని బేస్ సెంటర్‌కు తరలించగా వారిలో కంటిపొర ఉన్న 250 మందికి నగరిలోనే ఆపరేషన్ చేసి కంటి అద్దాలు, మందులు ఉచితంగా ఇవ్వడం జరిగింది. వారంతా నేడు స్పష్టంగా చూడగలుగుతున్నారు. మరోమారు ఈ శిబిరం నగరిలో ఏర్పాటు కానుంది. ఏర్పాటుకు సంబంధిత పనులు మంత్రి కార్యాలయం వద్ద జరుగుతున్నాయి. కంటి చికిత్సకు విచ్చేసే వారు నగరి మున్సిపాలిటీకి చెందిన వారైతే 90305 71715 నంబరుకు, నగరి మండలానికి చెందినవారైతే 93985 20622 నంబరుకు, పుత్తూరు మున్సిపాలిటీ అయితే 94935 65747 నంబరుకు, పుత్తూరు రూరల్ మండలం అయితే 98668 81427 నంబరుకు, విజయపురం మండలం అయితే 63058 96004 నంబరుకు, నింద్ర మండలం అయితే 98661 42258 నంబరుకు, వడమాలపేట మండలం అయితే 99488 71188 నంబరుకు సంప్రదించాలని మంత్రి క్యాంపు కార్యాలయ సిబ్బంది సూచించారు.

ఇదో సదావకాశం

పేదవారికి కంటి వైద్యం అందించడానికి 8 రోజుల పాటు కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. శంకర నేత్రాలయ, రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో ఆపరేషన్, చికిత్స చేయడం జరుగుతుందన్నారు. కంటి పొర ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్ చేసి, అద్దాలు, మందులు అందించడం జరుగుతుందన్నారు. ఈ సువర్ణ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆపరేషన్ కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని తన నివాసం వద్ద నిర్వహించే శిబిరానికి విచ్చేసే అత్యాధునిక బస్సులోనే ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన అన్ని సదుపాయాలు ఉంటాయని, ఆపరేషన్ చేసి కంటి వెలుగును ఇవ్వడం జరుగుతుందన్నారు.



మొబైల్ కంటి ఆపరేషన్ వాహనం వద్ద మంత్రి ఆర్‌కే రోజా

ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు

నగరి: మండలంలోని కేజీ కుప్పం గ్రామంలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జెడ్పీటీసీ సభ్యులు గాంధీ ఆధ్వర్యంలో సోమవారం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితం అనుసరించాల్సిన మార్గమన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం, విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో పేదలకు ప్రాతినిధ్యం కోసం ఆయన అందించిన సేవలు, రాజ్యాంగం ద్వారా ప్రజలకు కల్పించిన హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో సంఘ జాతీయ ఉపాధ్యక్షుడు ఎంకే ప్రకాష్, జాతీయ కార్యదర్శి గోవిందస్వామి, మండల కార్యదర్శి బాలవర్ధి రాజు, సర్పంచ్ మోహన్, మధు సుబ్రహ్మణ్యం, నాగరాజు, రమేష్, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు శుభాకాంక్షల వెల్లువ



డిప్యూటీ సీఎం నారాయణస్వామికి సత్కరిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి



ఎస్‌ఐలను సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం

వెదురుకుప్పం: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామిని చిత్తూరు జెడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం పుత్తూరులోని మంత్రి కార్యాలయానికి వెళ్లిన సీఈఓ ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రిని దుశ్శాలువతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. డైరీ, క్యాలెండర్ అందజేశారు. అలాగే చిత్తూరు ఆర్డీఓ, శ్రీరంగరాజనపురం ఎంపీడీఓ, వెదురుకుప్పం ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, బీసీ సెల్‌రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, వెదురుకుప్పం ఎంపీటీసీ రాధిక, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య, మాజీ ఎంపీపీలు అరుణ, పురుషోత్తం, రైతు విభాగం అధ్యక్షుడు ఉమాచంద్రారెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, మాజీ ఎంపీటీసీ రోశిరెడ్డి, రమణారెడ్డి, పలువురు అధికారులు, నాయకులు మంత్రిని కలిసి ఘనంగా సత్కరించారు. అందరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: నూతన సంవత్సరంలో అందరికీ శుభాలు కలగాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని డిప్యూటీ సీఎం, ఎక్సైజ్ శాఖ మంత్రి కే.నారాయణస్వామి ఆకాంక్షించారు. సోమవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివప్రకాష్ రాజుతో పాటు పార్టీ కార్యకర్తలతో కలసి డిప్యూటీ సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గంగాధరనెల్లూరు నియోజకవర్గం ఎస్ఐలతో డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రత్యేకంగా సమీక్షించారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో గ్రామాల్లో ప్రశాంతంగా ఉండేలా చూడాలన్నారు. చిన్న చిన్న గొడవలు చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవారికి నచ్చజెప్పి పంపించాలని సూచించారు. ముఖ్యంగా సారా తయారీపై, విక్రయాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు.

తల్లిదండ్రులు లేని పిల్లలకు చదువే ఆస్తి



మదనంబేడు అనాథ ఆశ్రమంలో పిల్లలకు దుప్పట్లు అందజేస్తున్న సీఐ శివకుమార్ రెడ్డి

సత్యవేడు: తల్లిదండ్రులు లేని పిల్లలకు చదువే ఆస్తి అని సత్యవేడు సీఐ శివకుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని మదనంబేడు పంచాయతీలోని అన్నే థెరిసా సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ శరణాలయంలో ఆయన పిల్లలకు ఉచితంగా దుప్పట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలను స్వచ్ఛంద సంస్థ చదివించడం, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని నేటి సమాజంలో ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం కూడా పేద విద్యార్థుల చదువుకు చేయూత అందిస్తోందన్నారు. అంతకుముందు ఆయన నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో అన్నేథెరిసా సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ అర్పుదరాజ్, ఎస్ఐలు శ్రీకాంత్ రెడ్డి, నాగార్జున రెడ్డి, వార్డన్లు నిర్మల, సౌమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ శ్రీరాముని అక్షింతలు



పిచ్చాటూరు : అయోధ్య రాముడి అక్షింతలను ప్యాక్ చేస్తున్న మహిళలు

పిచ్చాటూరు: అయోధ్య శ్రీరాముడి అక్షింతలను పంపిణీ చేయడానికి రామ భక్తులు సిద్ధమయ్యారు. ఈ నెల 22న అయోధ్యలో నూతనంగా నిర్మించిన శ్రీ రామమందిరం ప్రారంభం కానుంది. ఆలోపు ప్రతి ఇంటికీ అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు ప్రతి ఇంటికీ పంపిణీ చేయాలని రామభక్తులు నిశ్చయించారు. అయోధ్య రాముడి అక్షింతలు పిచ్చాటూరుకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ముకుందరాజు వద్దకు గతవారం చేరాయి. వీటిని ఇప్పటికే అన్ని పంచాయతీలకు చేరవేశారు. ఆ అక్షింతలను చిన్న చిన్న కవర్లలో ప్యాక్ చేసి ఈ నెల 15 లోపు ప్రతి ఇంటికీ పంపిణీ చేయనున్నట్లు ముకుందరాజు వెల్లడించారు. ప్రతి ఇంటికీ అక్షింతలు, శ్రీరాముడి చిత్రపటంతో పాటు జనవరి 22న అయోధ్యలోని శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవం సమయంలో ప్రతి ఇంటిలో ఎలాంటి నియమాలు పాటించాలనే అంశాలకు సంబంధించిన కరపత్రాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కీలపూడిలోని శేఖర్ రాజు ఇంటి వద్ద మహిళలు అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేయడానికి సిద్ధం చేస్తున్నారు.

అందరూ ఆనందంగా ఉండాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి

పుత్తూరు: నూతన సంవత్సరంలో అందరూ ఆనందంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్ రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బంది 80 మందికి కొత్త ఏడాదిని పురస్కరించుకుని స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండుగలైనా, ప్రకృతి విపత్తులు ఎదురైనా తమ విధులను నిర్విరామంగా నిర్వహిస్తున్న ఘనత ఒక్క పురపాలక సిబ్బందికే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో టీపీఓ మూర్తి, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మోహన్‌కృష్ణ, టీపీఎస్ వంశీ, సీనియర్ అసిస్టెంట్ రియాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రవచనం

తిరుపతి కల్చరల్: నూతన సంవత్సరం సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం అన్నమాచార్య కళామందిరంలో నిర్వహించిన గరికపాటి రమేష్‌బాబు ఆధ్యాత్మిక ప్రవచనం భక్తులకు ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన వెంకటేశ్వరస్వామి వైభవాన్ని వివరించారు. ఆయనను రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి బృందం శాలువతో ఘనంగా సత్కరించారు.

టాస్క్‌ఫోర్స్ డీఐజీని కలిసిన ఎస్పీ



తిరుపతి మంగళం : టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా బాధ్యత లు చేపట్టిన పి.శ్రీనివాస్ సోమవారం టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్ కర్నూలు రేంజ్ డీఐజీ ఎస్.సెంథిల్‌కుమార్‌ను మార్యదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఆపరేషన్లపై స్టడీ చేశానని, ఎర్రచందనం పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటానని ఎస్పీ శ్రీనివాస్ వివరించారు.

టీటీడీ బీసీ ఎంప్లాయిస్ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఈవో ధర్మారెడ్డి

తిరుపతి(అలిపిరి) : స్థానిక టీటీడీ పరిపాలన భవనంలో సోమవారం టీటీడీ బీసీ ఎంప్లాయిస్ సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్‌ను ఈవో ఏవీ ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు యానాదయ్య, శేషుబాబు ఆవిష్కరించారు. అనంతరం జేఈవో సదాభార్గవి, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, అడిషనల్ ఎఫ్ఏ అండ్ సీఏవో కస్తూరి బాయి, డీఈవో బోర్డు సెల్ శివకుమార్‌రెడ్డి, వీజీవో బాలిరెడ్డి తదితరులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సంఘం అధ్యక్షుడు పావులూరు రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శి గంగా రాజ్‌కుమార్ యాదవ్, కోశాధికారి కామరాజు, సాయికుమార్, మునిబాల కుమార్, రామచంద్ర, శైలేంద్ర కుమార్, లోకనాథం, దేశయ్య, రామారావు, సాయికుమార్, రాఘవేంద్రబాబు, రెడ్డెప్ప, హేమకుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆలయాలకు నూతన శోభ



నేత్ర దేవత ఆలయంలో భక్తుల సందడి

- అట్టహాసంగా న్యూఇయర్ వేడుకలు
- భక్తులతో పోటెత్తిన ఆలయాలు

నగరి: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఆదివారం పట్టణ పరిధిలోని ఆలయాలు కళకళలాడాయి. టీటీడీ ఆధీనంలోని కరియమాణిక్య స్వామి ఆలయంలో వేకువజాము నుంచే జనం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ప్రత్యేకంగా నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలు, అగరవత్తులు విక్రయించారు. ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి భక్తులకు ప్రవేశం కల్పించారు. రాజీవ్ నగర్ కొండపై ఉన్న షిర్డీసాయి దివ్య ధామం భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. నడకమార్గం, వాహన మార్గంలో భక్తులు అధికంగా కనిపించారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని సాయినాథుని ప్రత్యేకంగా అలంకరించారు. దీపపు హారతి, కాగడ హారతి పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే ప్రధాన ఆలయం, ధ్యానమందిరంతో పాటు పరివార దేవతలైన విఘ్నేశ్వర స్వామి, గాయత్రీ దేవి, దక్షిణామూర్తి, సుబ్రమణ్యస్వామి ఆలయాలు భక్తులతో నిండింది. నేత్రదేవత దేశమ్మ ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. టీటీడీ ఆధీనంలోని బుగ్గ కాశీవిశ్వేశ్వర ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో దర్శనమిచ్చారు. కరకంఠేశ్వర ఆలయం, ఓంశక్తి ఆలయం, వీరాంజనేయ స్వామి ఆలయం, గుండ్రాజుకుప్పం హనుమతేశ్వర క్షేత్రంలో భక్తులు అధిక సంఖ్యలో కనిపించారు.



సాయినాథుని దర్శించుకుంటున్న భక్తులు



బుగ్గ ఆలయం వద్ద భక్తుల సందడి

విజయపురంలో..

విజయపురం (నగరి): మండలవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు ఆలయాలకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. విజయపురం, బూచివానత్తం, పన్నూరు, మాధవరం, మహారాజపురం, ఆలపాకం, గంగమాంబపురం తదితర గ్రామాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు.



చర్చిలో కేక్ కట్ చేసి న్యూఇయర్ జరుపుకుంటున్న క్రైస్తవులు

శుభాలు కలిగించు స్వామి

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



సాయిబాబా ఆలయంలో ఎంపీపీ లతకు పుష్పగుచ్ఛం ఇస్తున్న అధికారులు



శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు



చర్చిలో కేక్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ అన్బళగన్, తులసీరామ్ యాదవ్

కార్వేటినగరం: నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సోమవారం మండల కేంద్రంలోని టీటీడీ అనుబంధంగా ఉన్న ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే బాలాజీ నగర్‌లో వెలసిన శ్రీషిరిడీసాయి బాబా ఆలయంలో, స్కంధపుష్కరిణీ సమీపంలో వెలసిన తంగమేశ్వరస్వామి ఆలయంలో, శ్రీరాజరాజేశ్వరీదేవి ఆలయంలో, సుద్దగుంట సమీపంలో వెలసిన శ్రీశిష్టా సౌందర్యవల్లీ సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో, చాకలివానిగుంట వద్ద వెలసిన శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో, సురేంద్రనగరంలో వెలసిన శ్రీవరద వేంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా వేణుగోపాలస్వామి ఆలయంలో వేకువజామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి మూల విరాట్‌కు అర్చనలు, అభిషేకాలు వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని సోమవారం సాయినాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు బాలాజీ, ఎంపీపీ లత దంపతులు స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం సాయిబాబా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మణెమ్మ, శేషాద్రి, సర్పంచ్ ధనంజయవర్మ పలువురు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: కష్టాలు తొలగి ఈ ఏడాది అన్ని విధాలా శుభాలు కలిగేలా ఆశీర్వదించు స్వామి అంటూ భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. 2023 వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరం 2024 ఆరంభానికి సోమవారం ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం అర్ధరాత్రి యువకులు కేక్‌లు కోసి సందడి చేశారు. పచ్చికాపల్లంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి, సీతాసమేత పట్టాభిరామాలయం, టీకేఎంపురం గ్రామంలో వెలసిన సాయిబాబా ఆలయం, చిన్నకొమరగుంటలో వెలసిన పద్మావతి, ఆండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో, అరుణగిరిపై ఉన్న శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి, చవటగుంట నందీశ్వర స్వామి ఆలయాల్లో పూజలు జరిగాయి.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలోని అన్ని ఆలయాల్లో 2024 నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడారు. మఠవలం గ్రామంలో వెలసిన గోవర్ధనాదీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, మండల కన్వీనర్ తులసీరామ్ యాదవ్ మండల పరిధిలోని చర్చిలకు కేక్ అందించారు. రాచపాళెం గ్రామంలో వెలసిన బాలగురునాదీశ్వర స్వామి ఆలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



బాలగురునాదీశ్వర స్వామివారికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

చంద్రగిరి: మండలంలోని తొండవాడ బ్రిడ్జి వద్ద సోమవారం రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. ఐతేపల్లికి చెందిన బాలాజీబాబు, మల్లయ్యపల్లికి చెందిన సోమశేఖర్, ఢిల్లీ కుమార్ ద్విచక్ర వాహనంలో శానంబట్లలో జరుగుతున్న పరుష పందేలకు బయలుదేరారు. వీరిని మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. బాలాజీ బాబు కుడికాలు విరిగింది. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని తిరుపతి రుయాకు తరలించారు.